## క్లుప్తంగా

### ప్రైవేట్ విద్యాసంస్థలపై చర్యలు తీసుకోవాలి




ఎంఈఓకు వినతిపత్రం అందజేస్తున్న ఏఐఎస్ఎఫ్ నాయకులు

**కోడుమూరు రూరల్:** నిబంధనలకు విరుద్ధంగా సంక్రాంతి సెలవుల్లో తరగతులు నిర్వహిస్తున్న ప్రైవేట్ విద్యా సంస్థలపై చర్యలు తీసుకోవాలని ఏఐఎస్ఎఫ్ నాయకులు ఎంఈఓ కార్యాలయం ఎదుట గురువారం ధర్నా నిర్వహించారు. నిబంధనలకు విరుద్ధంగా తరగతులు నిర్వహిస్తూ విద్యార్థులను మానసికరంగా ఇబ్బందులకు గురి చేస్తున్న ప్రైవేట్ విద్యాసంస్థలపై చర్యలు తీసుకోవాలని ఎంఈఓ శరభయ్యకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి రంగస్వామి, నాయకులు మహమ్మద్, రామాంజనేయులు, సుధాకర్, అభి, సురేష తదితరులు పాల్గొన్నారు.

### మౌలిక వసతులపై ప్రత్యేక దృష్టి సారించాలి

**కోడుమూరు రూరల్:** గ్రామాల్లో నివసించే ప్రజలకు అవసరమైన మౌలిక వసతులను కల్పించడంలో ప్రజాప్రతినిధులు, అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని ఎంపీడీఓ చంద్రశేఖర్ సూచించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయ సమావేశ భవనంలో గ్రామ పంచాయతీల అభివృద్ధి ప్రణాళికపై సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు, గ్రామ సచివాలయ సిబ్బందికి నిర్వహించిన శిక్షణా తరగతులు గురువారంతో ముగిశాయి. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ గ్రామాల్లో ప్రజలకు అవసరమైన అభివృద్ధి పనులు చేపట్టేందుకు అవసరమైన పనులను గుర్తించడంతో పాటు, గ్రామాభివృద్ధికి అవసరమైన లక్ష్యాలను నిర్ణయించుకోవాలన్నారు. ప్రజలతో చర్చించి గ్రామ సభలో తీర్మానం చేసిన ప్రతి పనిని ఈ-గ్రామ స్వరాజ్ యాప్‌లో నమోదు చేయాలన్నారు. ప్రభుత్వాల నుంచి మంజూరయ్యే నిధులను ప్రాధాన్యత ఉన్న పనులకు ఖర్చు పెట్టాలన్నారు. కార్యక్రమంలో పీఆర్ ఏఈ గంగరాజు, పంచాయతీ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

### అప్పులబాధతో వ్యక్తి ఆత్మహత్య

**గూడూరు రూరల్ :** కల్లూరుకు చెందిన వడ్డె మధు శేఖర్(56) అనే వ్యక్తి అప్పుల బాధ తాళలేక గురువారం పెద్దపాడు సమీపంలో ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. కల్లూరులో నివాసం ఉంటున్న మధు శేఖర్‌కు భార్య లక్ష్మీదేవి, ఇద్దరు సంతానం. కుటుంబ పోషణ నిమిత్తం బయటి వ్యక్తుల వద్ద చేసిన అప్పులు పెరిగిపోవడం, తీర్చే పరిస్థితి కనిపించక పోవడంతో మనస్థాపం చెంది పెద్దపాడు సమీపంలోని పొలంలో ఉన్న చెట్టుకు ఉరివేసుకున్నాడు. పొలం పనులకు వెళ్లిన కొందరు వ్యక్తులు గుర్తించి కె.నాగలాపురం పోలీసుస్టేషన్‌కు సమాచారాన్ని అందించారు. ఎస్ఐ సోమ్లానాయక్ ఘటనా స్థలానికి చేరుకుని మధు శేఖర్ మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అనంతరం కేసు నమోదు చేసుకుని విచారణ చేపట్టినట్లు ఎస్ఐ తెలిపారు.

### 24న పాణ్యం మండల మీట్

**పాణ్యం:** ఈనెల 24న మండల సర్వసభ్య సమావేశం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ దస్తగిరి గురువారం తెలిపారు. ఆయన మాట్లాడుతూ ఉదయం 11గంటలకు సమావేశం ప్రారంభమవుతుందన్నారు. కావున మండలంలోని సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు మండల స్థాయి అధికారులు తప్పనిసరిగా హాజరు కావాలని కోరారు. ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి సమావేశానికి హాజరవుతారని తెలిపారు.

### మిరప పంట దగ్ధంపై కేసు నమోదు

**కల్లూరు:** ఉలిందకొండ పోలీసు స్టేషన్ పరిధి కొంగనపాడు గ్రామంలో బుధవారం రాత్రి గుర్తుతెలియని వ్యక్తులు మిరప పంటను దహనం చేశారు. గ్రామానికి చెందిన తెలుగు నాగయ్య, తెలుగు శ్రీనివాసులు 14 ఎకరాల్లో మిరప పంటను సాగు చేసి, దిగుబడులను పొలంలో ఆరబోయగా దుండగులు నిప్పంటించారు. తెలుగు నాగయ్య ఫిర్యాదు మేరకు గురువారం ఉలిందకొండ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

### 29న వాక్ ఇన్ ఇంటర్వ్యూ

**కర్నూలు(హాస్పిటల్):** స్థానిక మెడికల్ కాలేజీ, ప్రభుత్వ సర్వజన వైద్యశాలలో ఐసీఎంఆర్, హెచ్‌బీసీఆర్ ప్రాజెక్టు క్యాన్సర్ వైద్య విభాగంలో తాత్కాలికంగా పనిచేసేందుకు వాక్ ఇన్ ఇంటర్వ్యూ నిర్వహించనున్నట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ పి.సుధాకర్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 29న ఉదయం 10 గంటలకు కళాశాలలోని కౌన్సిల్ హాలులో ఇంటర్వ్యూలు నిర్వహిస్తామన్నారు. మెడికల్ ఆఫీసర్, డేటా ఎంట్రీ ఆపరేటర్ పోస్టులకు అర్హత ఉన్న అభ్యర్థులు తమ ఒరిజినల్ సర్టిఫికెట్స్‌తో హాజరు కావాలని కోరారు.

### దోమలను నివారించాలి

**కర్నూలు(సెంట్రల్):** నగరంలో దోమల నివారణకు చర్యలు తీసుకోవాలని సీపీఎం జిల్లా పార్టీ నాయకుడు మారేళ్ల విజయ్ డిమాండ్ చేశారు. గురువారం సీపీఎం నాయకులు జోహరాపురంలో దోమల నివారణకు చర్యలు తీసుకోవాలని కోరుతూ నిరసన చేపట్టారు.

# అక్కచెల్లెమ్మలకు ఆర్థిక భరోసా

- డ్వాక్రా మహిళలకు రుణమాఫీ
- ఈ నెల 23న నాలుగో విడత నిధులు జమ చేయనున్న ప్రభుత్వం
- మండలంలో 598 గ్రూపులకు రూ.8.48 కోట్ల రుణమాఫీ
- హర్షం వ్యక్తం చేస్తున్న పొదుపు మహిళలు



పొదుపు మహిళలకు మూడో విడత మెగా చెక్కును అందిస్తున్న ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి (ఫైల్)



గడివేములలో పొదుపు మహిళలకు వైఎస్సార్ ఆసరా గురించి వివరిస్తున్న అధికారులు

**గడివేముల:** స్వయం సహాయక సంఘాల మహిళలు పడుతున్న ఆర్థిక ఇబ్బందులను గుర్తించిన వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి అధికారంలోకి రాగానే వారిని ఆదుకునేందుకు చర్యలు చేపట్టారు. గత ఎన్నికల తేదీ నాటికి పొదుపు సంఘాలకు ఉన్న రుణాలను మాఫీ చేస్తానని ప్రకటించారు. సభ్యులు తీసుకున్న రుణాలను నాలుగు విడతల్లో చెల్లిస్తానని హామీఇచ్చారు. ఇచ్చిన మాటకు కట్టుబడి వైఎస్సార్‌సీపీ అధికారంలోకి రాగానే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వైఎస్సార్ ఆసరా పథకం ద్వారా డాక్రా మహిళల రుణాల మాఫీకి శ్రీకారం చుట్టారు. ఇందులో భాగంగా ఇప్పటికే మూడు విడతల్లో లబ్ధిదారుల బ్యాంకు ఖాతాల్లో నగదు జమచేయగా ఈ నెల 23న నాలుగో విడత నిధులు జమ చేసేందుకు ప్రభుత్వం నిర్ణయించింది. దీంతో గ్రామాల్లో ఆసరా వారోత్సవాలు నిర్వహించనున్నారు. తమ రుణాలను చెల్లించడం ద్వారా ఆర్థికంగా బలోపేతం అయ్యేందుకు ఈ పథకం ఎంతో మేలు చేస్తోందని డ్వాక్రా సంఘాల మహిళలు చెబుతున్నారు. రుణాలతో కుటుంబపోషణకు ఇబ్బంది లేకుండా ఉంటుందంటున్నారు. తమ కుటుంబ ఆర్థికాభివృద్ధికి వైఎస్సార్ ఆసరా పథకం ద్వారా సాయమందిస్తున్న సీఎం జగన్‌మోహన్ రెడ్డికి మహిళలు కృతజ్ఞతలు తెలియజేస్తున్నారు.

**గడివేముల మండలంలోని వైఎస్సార్ ఆసరా పథకం వివరాలు**

| విడతలు | డ్వాక్రా సంఘాలు | సభ్యులు | సొమ్ము, రూపాయల్లో |
|---|---|---|---|
| మొదటి విడత | 597 | 7164 | 2,12,222,72 |
| రెండో విడత | 597 | 7164 | 2,12,295,28 |
| మూడో విడత | 596 | 7164 | 2,12,222,00 |

**మండలంలోని పొదుపు సంఘాల వివరాలు**

| | |
|---|---|
| గ్రామాలు | : 16 |
| గ్రామైక్య సంఘాలు | : 33 |
| మొత్తం పొదుపు గ్రూపులు | : 1003 |
| మొత్తం సభ్యుల సంఖ్య | : 10867 |

**పథకం లక్ష్యం ఇలా...**

వైఎస్సార్ ఆసరా పథకం స్వయం సహాయక బృందాల ఉత్పాదకతను మెరుగుపరచడంతో పాటు గత ప్రభుత్వ హయాంలో బ్యాంకుల్లో బకాయి ఉన్న రుణాలను తిరిగి చెల్లించేందుకు దోహదపడుతోంది. పథకంలో భాగంగా పట్టణ, గ్రామీణ స్వయం సహాయక బృందాల మహిళలకు 2019 ఎన్నికల నాటికి బ్యాంకుల్లో ఉన్న రుణాలను ప్రభుత్వం నాలుగు విడతలుగా చెల్లిస్తోంది. వైఎస్సార్ క్రాంతి పథం ద్వారా మండలంలోని అన్ని స్వయం సహాయక సంఘాలకు చెందిన సభ్యుల ఖాతాల్లో ఆసరా నిధులను నేరుగా ప్రతి ఏడాది జమ చేస్తున్నారు.




**జీవనోపాధి పెంచేలా...**

ఈ పథకంలో భాగంగా స్వయం సహాయక సంఘాలకు చెందిన మహిళలకు నైపుణ్యాభివృద్ధి, మార్కెటింగ్, ఆర్థిక నిర్వహణతో పాటు వ్యాపార రంగాల్లో శిక్షణ కార్యక్రమాలు అందిస్తున్నారు. రుణ బకాయిలు మాఫీ చేయడం ద్వారా డ్వాక్రా మహిళలకు ఆర్థిక ఉపశమనంతో పాటు వ్యాపారాల అభివృద్ధికి మద్దతు లభిస్తోంది. దీంతో పాటు మహిళల జీవనోపాధి మెరుగు పరచడమే ప్రధాన లక్ష్యంగా ప్రభుత్వం వైఎస్సార్ ఆసరా పథకాన్ని దిగ్విజయంగా అమలు చేస్తోంది.

**ఆర్థికంగా భరోసా**



గత ఎన్నికల సమయానికి మా గ్రూపు సభ్యులకు బ్యాంకులో రూ.4 లక్షల అప్పు ఉండేది. ఇచ్చిన మాట ప్రకారం సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి నాలుగు విడతల్లో పూర్తి రుణమాఫీ చేయడం ఆనందంగా ఉంది. ప్రభుత్వం మా అప్పు తీర్చడంతో ఆర్థికంగా భరోసా కలిగింది. ప్రతి విడతలో రూ.లక్ష సొమ్ము నేరుగా ఖాతాలో జమ చేస్తూ వస్తున్నారు. వైఎస్సార్ ఆసరా పథకంతో మాలాంటి వాళ్లకు ఎంతో మేలు. –బిడుదూరి అనురాధ, వరలక్ష్మి గ్రూపు, గడివేముల

**ఫ్యాన్సీ స్టోర్ పెట్టుకున్నాం**



మాది గడివేములలోని ఝాన్సీ లక్ష్మి పొదుపు గ్రూపు. 2019 ఎన్నికలకు ముందు మా గ్రూపునకు బ్యాంకులో రూ.5,03,215 రుణం ఉండేది. వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఆసరా పథకం కింద రుణమాఫీ చేసేందుకు చర్యలు చేపట్టారు. చెప్పిన మాట ప్రకారం ఇప్పటివరకు మూడు విడతల్లో నేరుగా మా బ్యాంకు ఖాతాలో జమ చేశారు. ఆసరా డబ్బులతో ఫ్యాన్సీ స్టోర్ పెట్టుకుని జీవనం సాగిస్తున్నాను. – ఈపూరి పద్మావతి, గడివేముల

**మాట నిలుపుకున్న సీఎం జగన్**



మాది చిందుకూరు గ్రామం వెంకటేశ్వర పొదుపు గ్రూపు. మా గ్రుపునకు గత ఎన్నికల సమయానికి అసలు, వడ్డీ కలిపి రూ.5,03,528 అప్పు ఉండేది. పాదయాత్రలో ఇచ్చిన హామీ మేరకు అధికారంలోకి వచ్చిన వెంటనే సీఎం వైఎస్ జగనన్న ఆసరా పథకం కింద నాలుగు విడతల్లో రుణమాఫీ చేశారు. ఇప్పటివరకు మూడు విడతలు నగదు అందించారు. ఇచ్చిన మాటను నిలబెట్టుకున్న సీఎం జగనన్నకు అండగా ఉంటాం. –వరలక్ష్మి, వెంకటేశ్వర గ్రూపు, చిందుకూరు

**మహిళలకు ఎంతో మేలు**



వైఎస్సార్ ఆసరా పథకం ద్వారా స్వయం సహాయక సభ్యులకు ఎంతో మేలు జరిగింది. ఇప్పటికే మూడు విడతల రుణమాఫీ సొమ్ము చెల్లించాం. ఈ నెల 23వ తేదీన నాలుగో విడత సొమ్ము బ్యాంకుల్లో జమచేయడం జరుగుతుంది. ప్రభుత్వ ఆదేశానుసారం లబ్ధిదారుల ఎంపిక జరిగింది. పొదుపు గ్రూపుల్లోని సభ్యులు ఆర్థికంగా ఎదగడానికి ఈ పథకం ఎంతగానో ఉపయోగపడింది. –హజరత్, ఏపీఎం, గడివేముల మండలం

### అంబేడ్కర్ ఆశయాలను సీఎం జగన్ నెరవేర్చారు



గడివేముల నుంచి విజయవాడకు వెళ్తున్న బస్సును ప్రారంభిస్తున్న దృశ్యం

**గడివేముల:** అంబేడ్కర్ ఆశయాలను ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి నెరవేర్చుతున్నారని జెడ్పీటీసీ ఆర్‌బీ చంద్రశేఖరరెడ్డి, పార్టీ మండల కన్వీనర్ శివరామిరెడ్డి అన్నారు. గురువారం రాత్రి విజయవాడలో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ స్మృతి వనం, విగ్రహ ఆవిష్కరణ కార్యక్రమానికి ప్రజలు వెళ్తున్న బస్సును జెండాఊపి ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ టీడీపీ ప్రభుత్వంలో అంబేడ్కర్ విగ్రహం ఏర్పాటు చేస్తామని చెప్పి చంద్రబాబు మోసం చేశారన్నారు. రూ.400 కోట్లతో అంబేడ్కర్ విగ్రహం అవసరమా? అని చంద్రబాబు అడగటం సిగ్గుచేటన్నారు. కానీ, సీఎం జగన్ జాతి యావత్తూ గర్వించేలా అంబేడ్కర్ విగ్రహాన్ని ఏర్పాటు చేసినట్లు చెప్పారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు రఘుమాధవరెడ్డి, నంద్యాల వెంకటేశ్వర్లు, పెసరవాయి సర్పంచ్ శేఖర్, ఉప సర్పంచ్ బాలచెన్ని, ఎంపీటీసీ మహేశ్వరరెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు దేశం నాగేశ్వరరెడ్డి, సంజీవరెడ్డి, రమణయ్య తదితరులు పాల్గొన్నారు.

**పాణ్యం:** విజయవాడలో రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బిఆర్ అంబేడ్కర్ 206 అడుగుల విగ్రహావిష్కరణ కార్యాక్రమానికి పాణ్యం నుంచి వైఎస్సార్‌సీపీ శ్రేణులు భారీగా తరలివెళ్లారు. గురువారం రాత్రి హైవే వద్ద సుమారు 45మందికి పైగా ఎస్సీ, ఎస్టీలు విజయవాడకు బయలుదెరి వెళ్లారు. మండల సచివాలయాల కన్వీనర్ సమంత్‌రెడ్డి, ఉప సర్పంచ్ పాలం చంద్రశేఖర్‌రెడ్డి, బాబు, గౌడ్, రమణయ్య జెండా ఊపి బస్సు ప్రారంభించారు.




జెండాఊపి బస్సును ప్రారంభిస్తున్న నాయకులు



టెంకాయ కొట్టి కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే రాంభూపాల్‌రెడ్డి

# మహిళల అభ్యున్నతే ప్రభుత్వ ధ్యేయం

- ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి

**కల్లూరు:** మహిళల అభ్యున్నతే ధ్యేయంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కృషి చేస్తున్నారని పాణ్యం ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి అన్నారు. గురువారం కల్లూరు అర్బన్ ముజఫర్ నగర్‌లో మెప్మా, టీఎల్ఎఫ్ (టౌన్ లెవల్ ఫెడరేషన్) వారి సహకారంతో 'పట్టణ ప్రగతి యూనిట్' కార్యక్రమంలో భాగంగా పేపర్ ప్లేట్ తయారీ కేంద్రాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం అందిస్తున్న ప్రోత్సాహకాలను సద్వినియోగం చేసుకొని జీవనోపాధులను మెరుగుపర్చుకోవాలని పొదుపు మహిళలకు సూచించారు. కార్యక్రమంలో మెప్మా ప్రాజెక్ట్ డైరెక్టర్ నాగశివలీల, కార్పొరేటర్ శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

# గ్రామాల అభివృద్ధికి కృషి చేయాలి



గడివేములలోని గ్రామపంచాయతీల అభివృద్ధి శిక్షణ కార్యక్రమంలో మాట్లాడుతున్న అధికారి



సి.బెళగల్లో జీపీడీపీ శిక్షణలో మాట్లాడుతున్న ఎంపీపీ బొంతల మునెప్ప

**గడివేముల:** ప్రజాప్రతినిధులు గ్రామాల అభివృద్ధికి కృషి చేయాలని ఎంపీపీ నాగమద్దమ్మ సూచించారు. గురువారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో గ్రామ పంచాయతీ అభివృద్ధి ప్రణాళికపై శిక్షణా తరగతులు నిర్వహించారు. ఎంపీపీ మాట్లాడుతూ ఆయా గ్రామ పంచాయతీలకు ప్రభుత్వం కేటాయించిన నిధులను ప్రజలకు అవసరమైన పనులకు వాడుకోవాలని సూచించారు. ఎంపీడీఓ శివమల్లేశ్వరప్ప మాట్లాడుతూ ముఖ్యంగా గ్రామాలలో తాగునీటి సమస్య తలెత్తకుండా చూడాలన్నారు. గ్రామాల్లోని డ్రైనేజీలు, సీసీ రోడ్లు నిర్మాణానికి ఎస్టిమేషన్లు తయారు చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఈఓఆర్‌డీ అబ్దుల్‌ఖాలీక్, ఏపీఎం హజరత్ తదితరులు పాల్గొన్నారు.

**కొనసాగుతున్న జీపీడీపీ శిక్షణా తరగతులు**

**ఓర్వకల్లు :** గ్రామ పంచాయతీ అభివృద్ధి ప్రణాళికపై నిర్వహిస్తున్న శిక్షణా తరగతులు కొనసాగుతున్నట్లు ఎంపీడీఓ శివనాగప్రసాద్ తెలిపారు. గురువారం ఆయా గ్రామాల పంచాయతీ కార్యదర్శులు, సర్పంచులు, సచివాలయ సిబ్బందికి జరిగిన శిక్షణా తరగతులలో 2024–2025 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి 16వ ఆర్థిక ప్రణాళిక నిధులను ఏయే పనులకు ఖర్చుపెట్టాల్సివుందో అవగాహన కల్పించారు.

**సమన్వయంతో పనిచేయాలి**

**సి.బెళగల్:** అధికారులు, ఉద్యోగులు, సర్పంచ్‌లు సమన్వయంతో పనిచేసి గ్రామాలను అభివృద్ధి పరచాలని ఎంపీపీ బొంతల మునెప్ప అన్నారు. గ్రామ పంచాయతీల అభివృద్ధి ప్రణాళికల (జీపీడీపీ) రూపకల్పణపై రెండు రోజుల శిక్షణ కార్యక్రమాన్ని ఈఓఆర్డీ సందీప్ ఆధ్వర్యంలో నిర్వహించారు.

**కల్లూరు:** గ్రామాల అభివృద్ధిలో అధికారులు భాగస్వాములు కావాలని ఎంపీడీఓ రమణమూర్తి అన్నారు. గురువారం కల్లూరు మండల పరిషత్ సమావేశ భవనంలో రెండవ రోజు జీపీడీపీ ( గ్రామ పంచాయతీ అభివృద్ధి కార్యక్రమం ) శిక్షణ కార్యక్రమం జరిగింది.

**ప్రణాళిక ప్రకారం సేవలు**

**పాణ్యం:** గ్రామాల్లో ప్రణాళిక ప్రకారం ప్రజలకు సేవలు అందించాలని ఈఓపీఆర్‌డీ సులోచన సూచించారు. గురువారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో సర్పంచ్, ఎంపీటీసీ, సిబ్బందికి శిక్షణ కార్యక్రమం నిర్వహించారు.

### గ్రూప్–1 అధికారిపై దాడి

- కేసు నమోదు

**కర్నూలు:** కర్నూలు సంక్షేమ భవన్‌లో శిక్షణ పొందుతున్న గ్రూప్–1 అధికారి భరత్ కుమార్‌రెడ్డిపై దాడి జరిగింది. బుధవారం సాయంత్రం కొత్తకోటలో బస్సు ఎక్కి సీటులో కూర్చొని కర్నూలుకు వస్తూ ల్యాప్‌టాప్ చూసుకుంటుండగా ఆయన ముందు సీటులో కూర్చున్న పవన్ అనే వ్యక్తి సడన్‌గా తన కుర్చీని వెనక్కు జరుపుకోవడంతో భరత్ కుమార్ రెడ్డి చేతిలోని ల్యాప్‌టాప్ కింద పడి పగిలిపోయింది. ఈ సందర్భంగా వారి మధ్య గొడవ జరిగింది. కర్నూలు కొత్తబస్టాండ్‌లో బస్సు దిగిన తర్వాత పవన్‌తో పాటు మరో ఇద్దరు స్నేహితులతో కలిసి భరత్‌కుమార్ రెడ్డిపై దాడి చేశారు. దీంతో ఆయన నాల్గవ పట్టణ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి విచారణ జరుపుతున్నట్లు పోలీసులు తెలిపారు.

# హోరాహోరీగా మండల స్థాయి క్రికెట్ పోటీలు



క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న అధికారులు



23 బంతుల్లో 62 పరుగులతో అజేయంగా నిలిచిన మురళీకృష్ణను అభినందిస్తున్న అధికారులు



గోరంట్ల-2 జట్టుతో తహసీల్దార్ జయన్న, ఎంపీడీఓ చంద్రశేఖర్

**సి.బెళగల్:** మండల కేంద్రం సి.బెళగల్‌లో ఆడుదాం ఆంధ్రా క్రీడా పోటీలలో భాగంగా బుధవారం ప్రారంభమైన మండల స్థాయి క్రికెట్ పోటీల హోరాహోరీగా సాగాయి. స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాల క్రీడా మైదానాలలో ఇన్‌చార్జ్ ఎంపీడీఓ శ్రీనివాసులు, ఈఓఆర్డీ సందీప్ ఆధ్వర్యంలో పీడీలు వెంకటేశ్వర్లు, రాఘవేంద్ర పర్యవేక్షణలో నిర్వహించారు. సి.బెళగల్ సర్పంచ్ పాండురంగన్న క్రికెట్ పోటీలను ప్రారంభించారు. అధికారులు క్రీడాకారులను పరిచయం చేసుకుని టాస్ వేసి సి.బెళగల్ – 3 (చింతమానుపల్లె), బ్రాహ్మణదొడ్డి జట్ల మధ్య పోటీలను ప్రారంభించారు.

**23 బంతుల్లో 62 పరుగులు**

ప్రారంభ మ్యాచ్‌లో చింతమానుపల్లె జట్టు ఆటగాడు మురళీకృష్ణ విధ్వంసకర బ్యాటింగ్‌తో భారీ స్కోర్‌తో అజేయంగా నిలిచాడు. మొదట బ్యాటింగ్ చేసిన బ్రాహ్మణదొడ్డి నిర్ణీత 10 ఓవర్లలో 5 వికెట్ల నష్టానికి 100 పరుగులు చేసింది. అనంతరం భారీ లక్ష్యంతో బరిలోకి దిగిన చింతమానుపల్లె జట్టు 9.5 ఓవర్లలో 4 వికెట్లు నష్టానికి 101 పరుగులు చేసి విజయం సాధించింది. ఈ మ్యాచ్‌లో చింతమానుపల్లె జట్టు ఆటగాడు మురళీకృష్ణ 23 బంతులకు ఐదు సిక్స్‌లు, నాలుగు ఫోర్లతో 62 పరుగులతో నాటౌట్‌గా నిలిచి జట్టు విజయంలో కీలకపాత్ర పోషించాడు. మ్యాచ్ అనంతరం చింతమానుపల్లె బ్యాటర్ మురళీకృష్ణను మండల అధికారులు, క్రీడా పోటీల నిర్వహణ అధికారులు అభినందించారు. అదేవిధంగా పోలకల్ – 1, సంగాల సచివాలయ జట్ల మధ్య జరిగిన మ్యాచ్‌లో సంగాల గ్రామానికి చెందిన సంగాలి అనే యువకుడు 51 పరుగులు పరులుగు జట్టును గెలిపించి పలువురి అభినందనలు పొందాడు. కాగా కొత్తకోట – 2 (ఈర్లదిన్నె) ఆటగాడు రవి రెండు ఓవర్లు బౌలింగ్ చేసి 8 పరుగులతో నాలుగు వికెట్లను తీయడంతో ఈర్లదిన్నె జట్టు రెండవ లీగ్‌కు చేరుకుంది. బెస్ట్ బౌలింగ్‌తో రాణించిన రవి అందరి అభినందనలు పొందాడు. సచివాలయ ఉద్యోగులు గౌస్, వినయ్, జాన్, గోపి, హరి, నగేష్, దత్తాత్రేయ, వలంటీర్లు, వైద్య సిబ్బంది, క్రీడాకారులు ఉన్నారు.

**మండల స్థాయి క్రికెట్ విజేత గోరంట్ల–2 జట్టు**

**కోడుమూరు రూరల్ :** ఆడుదాం..ఆంధ్ర పోటీల్లో భాగంగా జరిగిన మండల స్థాయి క్రికెట్ పోటీల్లో గోరంట్ల–2 జట్టు విజేతగా నిలిచింది. గురువారం కోడుమూరులోని బాలుర హైస్కూల్ మైదానంలో కోడుమూరు–4, గోరంట్ల–2 క్రికెట్ జట్ల మధ్య హోరాహోరీగా జరిగిన ఫైనల్ మ్యాచ్‌లో గోరంట్ల–2 జట్టు విజేతగా నిలిచింది. ముందుగా బ్యాటింగ్ చేసిన గోరంట్ల–2 జట్టు నిర్ణీత 10 ఓవర్లలో 6 వికెట్లు కోల్పోయి 107 పరుగులు సాధించగా, 108 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన కోడుమూరు–4 జట్టు నిర్ణీత 10 ఓవర్లలో 82 పరుగులు చేసి 26 పరుగుల తేడాతో ఓటమి పాలైంది. విజేతగా గోరంట్ల –2 జట్టును తహసీల్దార్ జయన్న, ఎంపీడీఓ చంద్రశేఖర్ అభినందించారు. మండల స్థాయిలో గెలుపొందిన గోరంట్ల–2 జట్టు ఈనెల 24నుంచి జరిగే నియోజకవర్గ స్థాయి ఆడుదాం..ఆంధ్ర ఆటల పోటీల్లో పాల్గొంటుంది. కార్యక్రమంలో పీఎస్ వెంకటేశ్వర్లు, పీఈటీలు సురేంద్రనాయుడు, శివలక్ష్మి, రఫీక్, లక్ష్మీదేవి, శ్రేయశ్రీ, దేవమణి, క్రీడాకారులు పాల్గొన్నారు.

# అంబేడ్కర్ ఆశయ సాధనకు ప్రభుత్వం కృషి

- పాణ్యం ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి



ఆకట్టుకున్న విద్యార్థినుల నృత్య ప్రదర్శన



మాట్లాడుతున్న పాణ్యం ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి

**కర్నూలు కల్చరల్:** డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఆశయ సాధనకు రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తోందని పాణ్యం ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి అన్నారు. గురువారం సామాజిక సమతా సంకల్పం కార్యక్రమంలో భాగంగా సిల్వర్‌జూబ్లీ కళాశాల మీటింగ్ హాల్‌లో నిర్వహించిన జిల్లా స్థాయి కార్యక్రమంలో ఎమ్మెల్యే కాటసాని ప్రసంగించారు. విజయవాడలో సుమారు రూ.400 కోట్లు ఖర్చు చేసి ఏర్పాటు చేసిన 206 అడుగుల అంబేడ్కర్ విగ్రహాన్ని ముఖ్య మంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ఈనెల 19న ఆవిష్కరించనున్నట్లు తెలిపారు. అన్ని వర్గాలకు స్వేచ్ఛ, స్వాతంత్ర్యం లభించేలా రాజ్యాంగాన్ని నిర్మించిన డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ లాంటి గొప్ప వ్యక్తులను ప్రతిఒక్కరూ గుర్తు పెట్టుకోవాలన్నారు. అంబేడ్కర్ ఆశయాలకు అనుగుణంగా ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి లోకల్ బాడీ ఎన్నికలు, నామినేటెడ్ పదువుల్లో మహిళలకు 50 శాతానికి పైగా రిజర్వేషన్ కల్పించారన్నారు. డీఈఓ రంగారెడ్డి మాట్లాడుతూ అంబేడ్కర్ విగ్రహావిష్కరణలో భాగంగా 10 రోజుల నుంచి పాఠశాలల్లో విద్యార్థులకు అనేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. సమాచార శాఖ ఆధ్వర్యంలో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ జీవిత చరిత్ర విశేషాలకు సంబంధించి ఏర్పాటు చేసిన ఫొటో ఎగ్జిబిషన్ ఆహుతులను ఆకర్షించిందన్నారు. అంతకు ముందు విద్యార్థుల సాంస్కృతి కార్యక్రమాలు అలరించాయి. కార్యక్రమంలో ఎస్ఎస్ఏ ఏపీసీ విజయ జ్యోతి, సిల్వర్ జూబ్లీ కళాశాల ప్రిన్సిపాల్ వి.వి.ఎస్. కుమార్, డిప్యూటీ ఈఓ హనుమంతరావు పాల్గొన్నారు.



నదిలోకి చేప పిల్లలను వదులుతున్న అధికారులు

# మత్స్యకారుల సంక్షేమానికి సహకారం

**కర్నూలు (అగ్రికల్చర్):** మత్స్య పథకాలను ప్రజలకు మరింత చేరువ చేసేందుకు అవసరమైన చర్యలు తీసుకుంటున్నట్లు జిల్లా రెవెన్యూ అధికారి మధుసూదన్‌రావు తెలిపారు. గురువారం మండల పరిధిలోని గొందిపర్ల గ్రామం ఎదురుగా ఉన్న షిరిడీ సాయిబాబా మందిరం పరిధిలో తుంగభద్ర నదిలో 6.75 లక్షల చేప పిల్లలను ఆయన జిల్లా వ్యవసాయ సలహా మండలి అధ్యక్షుడు బెల్లం మహేశ్వరరెడ్డి, జిల్లా మత్స్య శాఖ అధికారి శ్యామలతో కలిసి 80–100 మి.మీ సైజు మూడు రకాల చేప పిల్లలను వదిలారు. ఈ సందర్భంగా డీఆర్వో మాట్లాడుతూ ఇప్పటివరకు జిల్లాలోని సుంకేసుల రిజర్వాయర్, తుంగభద్ర నదులలో 25 లక్షల చేప పిల్లలను వదిలినట్లు పేర్కొన్నారు. మత్స్యకారుల సంక్షేమానికి ప్రభుత్వం అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటుందన్నారు. జిల్లా వ్యవసాయ సలహామండలి చైర్మన్ మాట్లాడుతూ గతంలో ఏ ప్రభుత్వమూ చేయని విధంగా వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం మత్స్యకారుల సంక్షేమానికి చర్యలు తీసుకుంటుందన్నారు. ఫిష్ ఆంధ్రా ద్వారా మంచి నీటి చేపలు, ఉప్పు నీటి చేపలను ప్రజలకు అందుబాటులోకి తెచ్చిందన్నారు. జిల్లా మత్స్య శాఖ అధికారి మాట్లాడుతూ మత్స్యకారుల అభివృద్ధికి ఉన్న పథకాల గురించి వివరించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ అజాంఖాన్ తదితరులు పాల్గొన్నారు.